సాక్షి
గుంటూరు

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024




హరిహర క్షేత్రంలో కుంకుమార్చనలు

అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలోని గిరిజా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో గౌరీ పాడ్యమి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: శ్రీ పానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహోత్సవాల ఆహ్వాన పత్రికలను సోమవారం మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఆలయ ఏసీ ఏ. రామకోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,217 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

పాడ్యమి పూజలతో ముగిసిన కార్తిక మాసం




అమరావతి: ప్రథమారామం అమరావతి క్షేత్రంలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తిక మాసం చివరిరోజు భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. కార్తిక అమావాస్య అనంతరం పాడ్యమి పర్వదినాన ఆలయాన్ని సందర్శించిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఉసిరిక చెట్టు వద్ద దీపాలను వెలిగించారు. నదిలో దీపాలను వదిలి పోలిని స్వర్గానికి పంపే కార్యక్రమం నిర్వహించారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి పూజలు చేశారు. కార్తిక మాసం ఆఖరిరోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శిల్పారామం పరిశీలన



గుంటూరు రూరల్: గుంటూరు శిల్పారామాన్ని సోమవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈవో వి. స్వామినాయుడు, నూతన చైర్ పర్సన్ చెరెడ్డి మంజుల రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ, ఫీల్డ్ సిబ్బందితో సీఈవో మాట్లాడారు. శిల్పారామం మొత్తం తిరిగారు. స్టాల్స్, బోటింగ్ పాండ్, గార్డెన్ పరిశీలించారు. బోటింగ్ పాండ్ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని, వారంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏవో శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, డీఈవో భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 39,843 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం 39,843 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,352 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,418 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

భవానీ దీక్షల విరమణ బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అధికారులు, పోలీస్ అధికారులతో సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో సమీక్ష సమావేశం జరిగింది. క్యూలైన్లు, స్నాన ఘాట్లు, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించి భక్తులకు త్వరితగతిన అమ్మ దర్శనం అయ్యేలా, గిరి ప్రదక్షిణలో భవానీ భక్తులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దీక్ష విరమణకు వచ్చే భక్తుల కోసం సమాచారం, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వీలుగా యాప్ రూపొందించాలని నిర్ణయించారు. యాప్‌లో పార్కింగ్ ప్రదేశాలు, సమాచార కేంద్రం, గిరి ప్రదక్షిణ, దర్శన సమయాలు, పూజా విధానం తదితర అంశాలను పొందుపరచడంపై చర్చించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు, డీసీపీలు గౌతమి శాలి, తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, ఇన్‌స్పెక్టర్ గురుప్రకాష్, దేవస్థానం ఈఈ వైకుంఠం పాల్గొన్నారు.

రైతుకు మద్దతు కరువు

- ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ దగా
- నిబంధనలు, తేమ శాతం పేరిట కొనుగోలుకు నిరాకరణ
- వర్షంలో పంట రక్షణకు రైతుల అవస్థలు
- సాక్షాత్తూ పౌరసరఫరాలశాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనే కొనుగోలులో తీవ్ర జాప్యం
- తేమశాతంతో లెక్కేసుకుని ప్రైవేటు వ్యాపారులకే రైతుల విక్రయం

అటు ధాన్యం.. ఇటు దైన్యం



బిల్లుల జాప్యంతో కొల్లిపర రోడ్డులో వేచిఉన్న ధాన్యం లోడులారీలు

తెనాలి: 'రైతులు అధైర్యపడొద్దు...ధాన్యాన్ని అయిన కాడికి అమ్ముకోవద్దు...ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది' అంటూ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇస్తున్న హామీలు అన్నదాతలకు భరోసానివ్వడం లేదు. సాక్షాత్తూ ఆయన నియోజకవర్గంలోనే వివిధ గ్రామాల్లోని వందలాది రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా ? అని ఎదురుచూస్తున్నారు. తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. వర్షపు జల్లులు నడుమ పండించిన పంటను రక్షించుకోవడానికి ఎందరో రైతులు, కౌలు రైతులు అవస్థ పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచినా ఆదుకోవడం లేదు. ధాన్యం కొనుగోలుకు సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. తేమ శాతంతో పేరుతో ఆంక్షలు పెడుతున్నారు. చేసేదిలేక రైతులంతా పట్టింపు లేకుండా కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులకే మొగ్గు చూపుతున్నారు. ఇచ్చినంత ధరకు అమ్మేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలోని కాల్వకు ఎగువ భూములైన తెనాలి ప్రాంతంలో రైతుల దీనస్థితి ఇది.

దళారుల దందా

రైతుల కష్టాన్ని ప్రైవేటు వ్యాపారులు దోచుకుంటున్నారు. మార్కెట్లో వరి ధాన్యానికి మద్దతు ధర అందకుండాపోయింది. కేవలం రూ.1400–1450 మధ్య కొనుగోళ్లు ఆరంభించారు. సోమవారానికి రూ.1330–50 మధ్య నడుస్తోంది. ఖరీఫ్ సీజను ఆరంభంలో భారీ వర్షాలతో వెదజల్లగా మొలకెత్తిన వరి దెబ్బతింది. పల్లపు చేలల్లో రెండు, మూడు సార్లు కూడా వెదజల్లాల్సి వచ్చింది. వరద నీరు నిలిచిన చేలల్లో పంట దిగుబడి తగ్గింది. ఎకరాకు 8–10 బస్తాల తగ్గుదల కనిపించింది. ధాన్యం దిగుబడి తగ్గిపోవటం, మార్కెట్‌లో 'మద్దతు' దొరక్కపోవటంతో అన్నదాతల్లో నష్ట భయం కనిపించింది. గత ఖరీఫ్ సీజనులో పంట చేతికొచ్చేసరికి మద్దతు ధరకు మించి 75 కిలోల బస్తా రూ.1700–1900 వరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది తారుమారైంది.

ప్రభుత్వం కొనుగోలులో తాత్సారం

రంగంలోకి దిగిన ప్రభుత్వం నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ప్రకటించింది. ఈ–క్రాపింగ్ నమోదైన చేలకు మాత్రమే కొనుగోలుకు సంసిద్ధమైంది. మార్క్‌ఫెడ్, పౌరసరఫరాలశాఖ వంటి ప్రభుత్వ ఏజెన్సీలను రంగంలోకి దించకుండా, రైస్ మిల్లర్లను, రైతులను అనుసంధానం చేశారు. తొలుత పంట చేతికొచ్చిన రైతులు, వ్యవసాయ అధికారి, రైతుసేవా కేంద్రాన్ని సంప్రదించి రిజిస్ట్రేషను చేసుకోవాలి. టెక్నీషియన్ వచ్చి తేమ శాతాన్ని పరిశీలిస్తారు. 17 శాతం వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఆపై ప్రతి శాతానికి కొంత తరుగును తీస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఆచరణలో వేగంగా కొనుగోళ్లు జరగటం లేదు. ఎందుకంటే తుపాను హెచ్చరికలకు ముందుగానే నూర్పిడి చేసిన వేలాది టన్నుల ధాన్యం ఇప్పటికీ రైతుల రక్షణలోనే ఉండటం ఇందుకు నిదర్శనం. కొనుగోళ్లలో తాత్సారంతో ఎక్కువమంది రైతులు ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు.

రవాణా వాహనాల కోసం ఎదురుచూపు

నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం అత్తోటలో వందకు పైగా రైతుల పండించిన ధాన్యం నిల్వలు ఇంకా మిల్లర్లు పంపే లారీల కోసం వేచిఉంది. సొంత భూమితో పాటు కౌలుకు మరో పదెకరాలు సాగుచేస్తున్న ఓ రైతు చెందిన వంద టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించేందుకు రిజిస్ట్రేషను చేశారు. తేమశాతం చూడటం, ఆమోదించటం పూర్తయి మూడురోజులైంది. ఇప్పటికీ గోనె సంచులు పంపలేదు. రవాణా వాహనాలు రానేలేదు. ఎన్నిరోజులు ఎదురుచూడాలంటున్న ఆ రైతు ప్రశ్నకు సమాధానం లేదు. ట్రక్ రిసీట్ రావటం జాప్యంతో లోడయిన లారీలు కూడా గంటల గంటలు రోడ్లపై వేచిఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. అక్కడకు సమీపంలోని చివలూరు చెందిన రైతు వేణుగోపాలరెడ్డి తేమశాతం లెక్కేసి ఇచ్చే డబ్బులతో పోల్చుకుంటే, ప్రైవేటు వ్యాపారులు ఇచ్చే డబ్బులు సమానమన్న భావనతో 180 బస్తాలను బయటే విక్రయించినట్టు చెప్పారు.ఇలా ఒకటికాదు...రెండు కాదు..ఎన్నో ఉదాహరణలు. ప్రభుత్వ ఏజెన్సీలతో ధాన్యం కొనుగోలు చేయించకుండా మిల్లర్లతో కొనిపించడం ఇందుకు కారణమనే అభిప్రాయం రైతుల్లో ఉంది. మిల్లర్లతో కొనిపించటం రైతులకు నష్టం... మిల్లర్లకు లాభం అని తెలిసినా ప్రభుత్వం ఆ పద్ధతినే అనుసరించింది. అదికూడా సక్రమంగా, వేగంగా జరగకపోవటంతో రైతులు, కౌలు రైతులు దగాపడుతున్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు కనీసం టార్పాలిన్లు కూడా ఇవ్వలేని దుస్థితి రైతులను అవస్థ పెడుతోంది.

రైతుల గుండెల్లో అలజడి

తుపాను ప్రభావంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. అప్పుడప్పుడూ వర్షం కురుస్తూ రైతులను బెంబేలెత్తిస్తోంది. తుపాను హెచ్చరికలతో వరి నూర్పిడులను నిలిపివేశారు. వర్షాలు, ఈదురు గాలులకు కోతకొచ్చిన చేలు అక్కడక్కడా నేలవాలాయి. ఈ పరిణామం ఎన్ని రోజులుంటుందో తెలియని పరిస్థితుల్లో మాగాణి రైతాంగం ఆందోళన పడుతోంది. దీనికితోడు నియోజకవర్గంలో ముదురు వరి చేలల్లో పంట చేతికొస్తోంది. గత రెండు వారాలుగా హార్వెస్టర్లతో ఎకాఎకిన నూర్పిడి చేసేస్తున్నారు.



దావులూరు–శివలూరు మధ్య రోడ్డుపై ధాన్యం రాశిపై పట్టలు కప్పుతున్న రైతులు

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- ఫ్లాగ్‌డేకు ఆర్థిక చేయూతనివ్వండి



గుంటూరు వెస్ట్: దేశం కోసం సైనికుల త్యాగాలను వెలకట్టలేమని, మరణానంతరం వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సోమవారం ఫ్లాగ్ డే స్టిక్కర్లు, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన ఫ్లాగ్ డే జరుగుతుందన్నారు. మరణించిన సైనికుల కుటుంబ సభ్యుల ఆర్థిక చేయూత కోసం స్టిక్కర్లు తక్కువ ధరకు విక్రయిస్తారన్నారు. ఇందులో ప్రతి ప్రభుత్వ శాఖ పాల్గొనాలని చెప్పారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా కొనుగోలు చేసి సహకరించాలని కోరారు. అనంతరం స్టిక్కర్లు, పోస్టర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి గుణశీల, జిల్లా అధికారులు ఆవిష్కరించారు.

లింగ వివక్షను రూపుమాపాలి: కలెక్టర్

సమాజంలో లింగ వివక్షను సమూలంగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జెండర్ క్యాంపైన్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 23 వరకు నిర్వహించే ఈ క్యాంపైన్‌ను విజయవంతం చేయాలని కోరారు. జెండర్ ఆధారిత హింస, ఆడపిల్లలకు విద్య, బాల్య వివాహాల నిర్మూలన, గృహ హింస అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిండి'కేటు'గా ఇసుక దోపిడీ

ఎన్నికల ముందు చంద్రబాబు ఉచిత ఇసుక ఇస్తాం..మద్యం సిండికేట్లను అదుపుచేస్తాం.. అవినీతికి , అక్రమాలకు తావివ్వకుండా పని చేస్తామని డాంబికాలు పలికారు. తీరా అధికారం చేపట్టాక హామీలను పక్కన పెట్టారు. పార్టీ నేతల్లో కొందరు అన్నింటా తామై వ్యవహరిస్తూ అరాచక శక్తులుగా మారుతున్నా అధిష్ఠానం పట్టించుకోవడం లేదు. పటిష్టమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థ కలిగిన రాష్ట్ర ప్రభుత్వం, పెద్దలు బయటకు ఒకటి చెబుతున్నారు.. క్షేత్ర స్థాయిలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటోంది. దీనికి ఉచిత ఇసుక విధానం అడ్డం పడుతోంది . పార్టీ అండ చూసుకుని పచ్చ నేతలు ఇసుకాసురులుగా మారారు. సిండికేటుగా మారి క్వారీల మీద పెత్తనం చెలాయిస్తున్నారు.

- అక్రమార్కుల చెరలో ఇసుక క్వారీలు
- దోచుకుంటున్న కాంట్రాక్టర్లు
- అధిక లోడు, అక్రమ రవాణా
- వంత పాడుతున్న ప్రజాప్రతినిధులు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న టిప్పర్ల యజమానులు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చేందుకు వచ్చిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

టగుంటూరు వెస్ట్ : జిల్లాలోని పేదలకు ఉచితంగా అంటే నామమాత్రమే రేట్లకే అందాల్సిన ఇసుకను కొందరు కాంట్రాక్టర్లు వారి గుప్పెట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టిప్పర్ లారీలను సైతం అద్దెకు తీసుకుని యథేచ్ఛగా తిప్పుకుంటున్నారు. కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు వారి అనుచరులతో కలిసి ఈ దందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 3,000 టిప్పర్ లారీలు ఉండగా గుంటూరు జిల్లాలో 700 పైగానే ఉన్నాయి. కొన్ని వేల మంది వీటిపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతా మారిపోయింది. సిండికేట్లు ఇసుక ధరలను భారీగా పెంచేసి అమ్ముకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. ఈ నేపథ్యంలో సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రాష్ట్ర టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిప్పర్ యజమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమం చేపడతామని తెలిపారు.



అధిక లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ

నిబంధనలకు పాతర



ప్రభుత్వం ఇసుకను తక్కువ ధరకు అందించాలని సంకల్పించడం మంచిదే. కాని క్షేత్రస్థాయిలో అస్సలు అలా జరగడంలేదు. వాస్తవానికి 10 టైర్ల లారీ ఇసుకను రూ.2600 అందించాలి. కాంట్రాక్టర్లు కొందరు మాత్రం దళారుల ద్వారా రూ.10 వేలకు అమ్ముకుంటున్నారు. ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడు.

–వెంకటేష్, లారీ ఓనర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా నాయకుడు

రీచ్‌లలో కనిపించని అధికారులు



ఇసుక రీచ్‌లు ప్రజలకు, భవన నిర్మాణ రంగానికి ఎంతో ముఖ్యమైన అంశం. అయితే, ఇక్కడ అధికారులు లేరు. కొందరు సిబ్బంది ఉన్నా వారి మాటలు ఎవరూ వినడంలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని సిండికేట్లు దోచుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారు. తమ వెనుకాల నాయకులు ఉన్నారని బాహాటంగానే చెబుతున్నారు.

– ఫణికుమార్, లారీ ఓనర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి

మా పొట్టకొడతారా !



కొందరు సిండికేట్లు రీచ్‌కు 30 టిప్పర్ లారీలు వారే సొంతంగా అద్దెకు తీసుకుని అధిక లోడ్‌లు వేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. మిగతా వాళ్ళు ఎలా జీవించాలి ? నెలవారీ బ్యాంకు బకాయిలు కూడా చెల్లించలేకపోతున్నాం. ఎన్నో ఏళ్లుగా దీనిపైనే జీవిస్తున్నాం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. అధికారులు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదు.

–ఎం.రాజు, టిప్పర్ లారీ యజమాని, గుంటూరు

ధనుర్మాస ప్రచార వాహనాలు ప్రారంభం

తాడేపల్లి రూరల్: ధనుర్మాసం ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ప్రచార వాహనాలను శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ దేవదాయ కమిషనర్ ఎస్. సత్యనారాయణ సోమవారం దర్శించారన్నారు. ఆయనకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి తీర్థప్రసాదాలతో పాటు మంగళా శాసనం అందజేశారని తెలిపారు. ఈనెల 16నుంచి జనవరి 13వరకు ధనుర్మాస కార్యక్రమాలను మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దేవదాయ కమిషనర్‌కు ప్రసాదాలు అందజేస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి

డీఎస్సీ తూచ్ !

- ఇప్పట్లో పరీక్ష నిర్వహణ లేనట్లే ..
- హడావుడి చేసి ఉసూరుమనిపించిన ప్రభుత్వం
- విద్యాశాఖ రోడ్ మ్యాప్‌లో మేలో రిక్రూట్‌మెంట్‌గా ప్రకటన
- గతంలో షెడ్యూల్ ప్రకటించి ప్రభుత్వం అభాసుపాలు
- ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయ నియామకాలకు బ్రేక్
- సర్దుబాటుతోనే ముగియనున్న విద్యాసంవత్సరం



ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యాంశాల బోధన (ఫైల్)

కేడర్	పోస్టులు
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు, ఉర్దూ)	61
స్కూల్ అసిస్టెంట్ (హిందీ)	60
(ఇంగ్లిషు)	70
(మాథ్స్)	36
(ఫిజికల్ సైన్స్)	58
(బయాలాజికల్ సైన్స్)	87
(సోషల్ స్టడీస్)	111
(ఫిజికల్ ఎడ్యుకేషన్)	169
(ఎస్జీటీ)	491
మొత్తం	1,143

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టుల భర్తీకి అవకాశం

డీఎస్సీ–2025 నియామక ప్రక్రియ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులను భర్తీ చేసే అవకాశముంది. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల వారీగా వివిధ కేడర్‌ల వారీగా పోస్టులు ఈ విధంగా ఉన్నాయి.

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ నిర్వహణపై కూటమి ప్రభుత్వం వాయిదాల పర్వం కొనసాగిస్తోంది. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అంటూ ఊరించింది. ఆర్భాటంగా చేసిన ప్రకటనలు ఇప్పుడు నీటి మూటలయ్యాయి. ప్రభుత్వతీరుతో బుట్టదాఖలైన డీఎస్సీ–2024 నోటిఫికేషన్, ఉపాధ్యాయ నియామక ప్రక్రియ కాస్తా డీఎస్సీ–2025గా మారింది. ఇక సర్దుబాటు ద్వారా వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఆశలు సన్నగిల్లాయి. విద్యాసంవత్సరం ముగిసే వరకు అదే పాఠశాలల్లో కొనసాగాల్సి ఉంది.

నిరుద్యోగ ఉపాధ్యాయులకు నిరాశ

తాజాగా రోడ్‌మ్యాప్ ఆన్ టీచర్ సర్వీసెస్ పేరుతో పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన విధివిధానాల్లో డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌ను వచ్చే ఏడాది మే 11 నుంచి 30 వరకు చేపట్టనున్నట్లు ప్రకటించారు. దీంతో డీఎస్సీ నియామక ప్రక్రియపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులకు నిరాశే మిగిలింది. పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు గత జూలై–ఆగస్టు నెలల్లో నిర్వహించిన సర్దుబాటు ప్రక్రియ విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుతో తీవ్ర జటిలంగా మారింది. ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహాన్ని చవిచూసింది. ఎంతో సులభంగా నిర్వహించేందుకు వీలున్న సర్దుబాటు ప్రక్రియ అధికారుల అనాలోచిత నిర్ణయాలు, విద్యాశాఖ మంత్రి తీరుతో ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. మండలస్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియను డివిజన్, జిల్లాస్థాయిలకు మార్చి వేశారు. ఉపాధ్యాయులను ఇష్టారాజ్యంగా వేర్వేరు పాఠశాలలకు పంపించారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ వ్యవధి పెరగడంతో పాటు ఇక ప్రస్తుత విద్యాసంవత్సరానికి డీఎస్సీ ద్వారా కొత్తగా ఉపాధ్యాయుల నియామకాలు జరిగే అవకాశం లేదని విద్యాశాఖ రోడ్‌మ్యాప్ ద్వారా స్పష్టమైంది.

104 మహిళా ఉద్యోగులపై మేనేజర్ వేధింపులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి ఏపీఐఐసీ భవనంలో వున్న 104 మెడికల్ హెల్ప్ లైన్ కాల్ సెంటర్‌లో మహిళా ఉద్యోగులపై కార్యాలయ మేనేజర్ తన కిందిస్థాయి ఉద్యోగినులను వేధిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం కొంతమంది మహిళా ఉద్యోగులు మానేసి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ మేనేజర్ నోటికి వచ్చినట్లు బూతులు తిడుతున్నారని, శృతిమించి మాటలు మాట్లాడడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని వాపోయారు. ఇప్పటికే ఆయన మాటలను తట్టుకోలేక కొంతమంది మహిళలు ఉద్యోగాలు మానివేశారని, కొంతమంది తప్పని పరిస్థితుల్లో వేధింపులను భరిస్తూ ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మేనేజర్‌కు అనుకూలంగా ఉన్న వారిని ఒకలా, మిగిలిన వారిని మరోలా చూస్తూ దుసురుగా ప్రవర్తిస్తున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. 104 ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా మేనేజర్‌పై ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. మేనేజర్‌పై తక్షణ చర్యలు తీసుకుని ఆయన్ను విధుల నుంచి తప్పించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని బాధితులు కోరారు.



మాట్లాడుతున్న ఓ బాధితురాలు

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర
కనిష్ఠం : రూ. 1,900 గరిష్ఠం : రూ. 2,300
మోడల్ ధర రూ. 2,700

క్లుప్తంగా

పలువురు జూదరుల అరెస్టు

లక్ష్మీపురం: వేర్వేరు చోట్ల 23 మంది జూదరులను పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో నివాస గృహాల మధ్య ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు లేకుండా పేకాడుతున్న ఐదుగురు జూదరులను స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. దేవాపురం 3వ లైన్‌లోని ఆకుల రెసిడెన్సీ అనే అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బంది దాడి చేశారు. ఐదుగురు జూదరులను స్టేషన్‌కు తరలించి వారి వద్ద నుంచి రూ.84వేలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

■ బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో 18 మంది పేకాట ఆడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఆకస్మిక దాడులు చేసి 18 మందిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వారి వద్ద గల రూ.80 వేల నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

తాడేపల్లి పోలీసులు సోమవారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడిచేసి 17 మంది అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 34వేలు స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆశ్రమం రోడ్డులో ఎస్‌బీ వారు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో తనిఖీ చేయగా పది మంది పేకాట ఆడుతున్నారు. వారి వద్ద నుంచి రూ. 20వేలు స్వాధీనం చేసుకున్నారు. వడ్డేశ్వరం శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురితో పాటు రూ. 7వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు.

బాలిక హత్య కేసు ఛేదించిన పోలీసులు

- నాలుగు నెలలు తర్వాత గ్యాస్ డెలివరీ బాయ్ అరెస్ట్
- క్లూ లభించకుండా నిందితుడు పలు రాష్ట్రాల్లో సంచారం
- సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తింపు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: బాలికను హత్య కేసులో చిక్కుముడి వీడింది. ఈ ఘటనలో గ్యాస్ డెలివరీ బాయ్‌ని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో ఈ ఏడాది జూలై 15న కుమార్తె హత్యకు గురైనట్లు తండ్రి చేబ్రోలు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. హత్య ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణతోపాటు సీసీఎస్, ఎనిమిది బృందాలతో నిందితుడి ఆచూకీ కోసం జల్లెడ పట్టారు. అప్పటి నుంచి అతడు ఎటువంటి ఆధారాల్లేకుండా నాలుగు నెలలకు పైగా కానరాలేదు. ఏపీతోపాటు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోనూ గాలించారు. సీసీటీవీ ఫుటేజ్, లైవ్ ట్రాకింగ్, సామాజిక మాధ్యమాలు, సాంకేతిక ఆధారాలు, వ్యక్తుల సమాచారంతో గుంటూరు, విజయవాడ, హన్మకొండ, హైదరాబాద్, విశాఖపట్నం, నర్సీపట్నం, తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసుపై పదిహేను రోజులకు ఒకసారి పోలీస్ బృందాలతో సమీక్ష నిర్వహించారు.

పలుచోట్ల బస

బాలికను హత్య చేసిన నాగరాజు గుంటూరు నుంచి బస్‌లో తొలుత విజయవాడ వెళ్లాడు. అక్కడ్నుంచి రైల్లో హన్మకొండలో దిగి అక్కడ బస చేశాడు. అనంతరం హైదరాబాద్, విశాఖపట్నం, పీఠాపురం, రాజమండ్రి, తిరుపతి, తమిళనాడులోని తిరువూరు స్పిన్నింగ్ మిల్లులో పనిచేసి, రాజమండ్రి చేరాడు. అక్కడ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న నాగరాజుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, బాలిక తల్లితో అతనికి వివాహేతర సంబంధం ఉండేది. వారి మధ్య విబేధాలు వచ్చాయి. ఈ క్రమంలో తల్లిపై కోపంతో బాలికను హత్య చేశాడు. నాలుగు నెలలకు పైగా ఎటువంటి ఆధారాల్లేకుండా తిరుగుతున్న నాగరాజుని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సీసీఎస్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సీఐ వై.కోటేశ్వరరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ అభిలాష్‌కు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా

నిందితుడు స్పిన్నింగ్ మిల్, గ్యాస్ గోదాంలో పనిచేసేవాడని తెలియడంతో ఆయా ప్రదేశాల్లోనూ వెదికారు. కేసును ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పలు ప్రాంతాల్లోనూ నిఘా ఉంచారు. గతంలో ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో రజనీని గొంతు నులిమి హత్య చేయగా, అప్పట్లో పనులు చేసుకుంటూ కర్ణాటకలోని గుల్బర్గా, మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మకాం వేశాడని తెలిసి, అక్కడ గాలించారు. ఈ క్రమంలో రాజమండ్రిలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్నాడనే సమాచారంతో పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ సిబ్బందితో వెళ్లి కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామవాసి ఎస్.నాగరాజుని అరెస్ట్ చేశారు. అతను చేబ్రోలు లోని కొత్తరెడ్డిపాలెంలో అద్దెకు ఉంటూ, ఒక గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు.

ఏఎన్‌యూ లిఫ్టర్‌కు కాంస్య పతకం

96 కేజీల కేటగిరీలో ప్రతిభ కనబరిచిన అరుణేష్ బాబు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భాగంగా సోమవారం పలు కేటగిరీలో పోటీలు జరిగాయి. వివరాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్. పాల్ కుమార్ వెల్లడించారు.

- 96 కేజీల కేటగిరిలో మధురై కామరాజ్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టర్ అఫ్రీన్ మొత్తం 300 కేజీల బరువులు ఎత్తి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. తిరువల్లువార్ యూనివర్సిటీ లిఫ్టర్ జె. దీర్షన్ 298 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. నాగార్జున యూనివర్సిటీ లిఫ్టర్ ఏ. అరుణేష్ బాబు 297 కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాధించాడు.
- 102 కేజీల విభాగంలో సావిత్రీబాయి పూలే యూనివర్సిటీ లిఫ్టర్ వైష్ణవ్ సాహసి ఠాకూర్ మొత్తం 321 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. . బెంగళూరు సిటీ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టర్ ఫాజిల్ రెహ్మాన్ 311 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. కొలహపూర్ లోని శివాజీ యూనివర్సిటీ లిఫ్టర్ రాజేంద్ర 306 కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాధించాడు. పోటీలు మంగళవారంతో ముగుస్తాయని ప్రొఫెసర్ పాల్ కుమార్ తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 244 , తూర్పు కెనాల్‌కు 41, పశ్చిమ కెనాల్‌కు 56, నిజాంపట్నం కాలువకు 240, కొమ్మమూరు కాలువకు 1110 క్యూసెక్కులు విడుదల చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి తెనాలి మారిస్‌పేట మొండి గోడల వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై చొక్కా లేదు. యాచకుడై ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా శాఖలో ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

లక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల పోస్టాఫీసుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని గత కొంత కాలం నుంచి విధులకు హాజరుకాకుండా ఉన్న గుంటూరు హెడ్ పోస్టాఫీస్‌లో పని చేస్తున్న పోస్ట్‌మేన్ నాగార్జున మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గుంటూరు పోస్టల్ డివిజనల్ సూపరిటెండెంట్ యలమందయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు అతడి మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం వెబ్‌సైట్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు మాత్రమే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మరింత విస్తృతంగా అర్జీల పరిష్కారం


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సమస్యలపై ప్రజల అర్జీలను మరింత వేగంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అర్జీలను ప్రజలు స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు కూడా ప్రతి వారం ఇవ్వొచ్చని తెలిపారు. దీంతో ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. అధికారులు అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆమె ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని తెలిపారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి అర్జీలు వెళితే సంబంధిత అధికారికి మెమో జారీ చేయాలని చెప్పారు. అనంతరం వచ్చిన 153 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

15లోపు పీఎంఏవై ఇళ్లను పూర్తి చేయాలి

గుంటూరు వెస్ట్: ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం(పీఎంఏవై) ద్వారా మంజూరైన ఇళ్లను నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఈ నెల 15లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 3వ వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీఎంఏవై ద్వారా మంజూరైన లక్ష గృహాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నారని తెలిపారు. జిల్లాలో 4452 గృహాలకుగానూ ఇప్పటి వరకు 2,400 పూర్తయ్యాయని, 2,052 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. వీటికి అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయాలని చెప్పారు. హౌసింగ్ లే అవుట్స్‌లో ఆప్షన్-3 కింద నిర్మిస్తున్న ఇళ్లను రాజీ లేకుండా పూర్తి చేయాలని, అధికారులు నిరంతరం నిర్మాణాలను పర్యవేక్షించాలని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన మౌలిక సదుపాయాల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, వీటిపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించాలని చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులకు అపార్ ఐడీల ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఈ నెల 7న మెగా పేరెంట్స్ మీటింగ్‌లు విజయవంతం చేయాలని కోరారు. పీఎం విశ్వకర్మ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. గ్రామ, మండలాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సీపీఓ శేషశ్రీ , హౌసింగ్ పీడీ ప్రసాద్, ఐసీడీఎస్ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈఓ రేణుక, డీపీఓ సాయికుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐనని చెప్పి రెండో వివాహం

- పోలీస్ యూనిఫాం దుస్తులు ధరించిన ఫొటోలు చూపించి మోసం
- దఫాల వారీగా సుమారు రూ.23 లక్షలు కాజేత

నగరంపాలెం: ఎస్ఐనని చెప్పి రెండో వివాహం చేసుకుని మోసగించాడని ఓ వివాహిత వాపోయింది. ఈ మేరకు అతనిపై గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. నందివెలుగురోడ్డులోని ఓ ప్రాంతంలో ఉంటూ నర్సింగ్ హోంలో రిసెప్షనిస్ట్‌గా 2016 నుంచి పనిచేస్తున్నా. గతంలో నాకు వివాహం కాగా, ఇద్దరు ఆడపిల్లలు. భర్తతో విభేదాలు వచ్చి విడాకులు తీసుకుని వేర్వేరుగా ఉంటున్నాం. రెండేళ్ల కిందట తెనాలి నాజర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి ఆసుపత్రికి వచ్చి, తల్లికి చికిత్స చేయించాడు. ఈ క్రమంలో నా సెల్ నంబర్ అడగ్గా ఇచ్చా. ఆ తర్వాత దగ్గరయ్యాడు. భర్తతో విడిపోయి ఇద్దరి పిల్లలతో తండ్రి వద్ద ఉంటున్నానని చెప్పా. తెనాలిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సస్పెండ్ అయినట్లు నమ్మబలికాడు. ఇంకా పెళ్లి కాలేదని చెప్పి, ఇద్దరు పిల్లలను, నన్ను బాగా చూసుకుంటానని చెప్పాడు. దీంతో గతేడాది మార్చిలో విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో పెళ్లి చేసుకున్నాం. విధులకు వెళ్లేటప్పుడు పోలీస్ యూనిఫాంతో వెళ్లేవాడు కాదు. అయితే, యూనిఫాంతో, ఇతర పోలీస్ అధికారులతో దిగిన ఫొటోలు చూయించాడు. అయినప్పటికీ విధులకు వెళ్లాక యూనిఫాంలో ఉండగా వాట్సాప్ వీడియో కాల్‌లోనైనా మాట్లాడాలని వేడుకున్నా పట్టించుకోలేదు. సరిగ్గా మూడు నెలల క్రితం అతనిపై అనుమానం వచ్చి, తెనాలి రెండో పట్టణ పీఎస్‌లో సోదరుడితో విచారించాను. నన్ను మోసగించినట్లు తేలింది. దీంతో అతను చెప్పిన చిరునామాలోని ఇంటికెళ్తే అతని భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐటీ ఫైల్స్ చేసేవాడని వారు తెలిపారు. అదిగాక నందివెలుగు రోడ్డులోని ఓ నగర్‌లో మా ఇంటి నిర్మాణ పనులకు సంబంధించి మెటీరియల్ త్వరగా తెప్పిస్తానని దఫాల వారీగా రూ.23 లక్షలు, సుమారు ఏడెనిమిది సవర్ల నగదు తీసేసు కున్నాడు. ఇటీవల నా సోదరుడు కొనుగోలు చేసిన కొత్త కారుని కూడా తనఖాలో పెట్టాడని తెలిసింది. అతనిపై పాత గుంటూరు పీఎస్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.

రోడ్డు కబ్జా చేసి బెదిరిస్తున్నారు



గుజ్జనగుండ్ల సమీపంలోని మా దుకాణాల ముందు హోటల్ వ్యాపారం పెట్టుకున్న కొందరు వ్యక్తులు పక్కకు జరగమంటే బెదిరిస్తున్నారు. మేము ఖాళీ చేయం.. ఏం చేసుకుంటావో చేసుకో! అంటున్నారు. లక్షలు పెట్టి చేస్తున్న వ్యాపారంలో వీళ్ల కబ్జా కారణంగా నష్టాలు వస్తున్నాయి. మా సమస్యను అర్థం చేసుకోవాలి. కె.వేణుగోపాల్, గుంటూరు

వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం


ఫిర్యాదితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో బాధితుల ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు.కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు (పరిపాలన) రమణమూర్తి, కె.సుప్రజ, శిక్షణ ఐపీఎస్ అధికారిణి దీక్ష, డీఎస్పీలు రమేష్, శివాజీరాజు పాల్గొన్నారు.

వేధింపులపై చర్యలు తీసుకోవాలి

చుట్టుగుంట వద్ద మరమరాల తయారీ దుకాణం ఉండేది. రెండేళ్ల క్రితం దఫాల వారీగా దుకాణంలో చోరీలు జరిగాయి. ఈ క్రమంలో వెంగళాయపాలెం వాసి దుకాణం వద్దకు వచ్చి ఫలానా వారు తెలుసునని, చోరీలు ఛేదిస్తానని నమ్మబలికాడు. నా ఫోన్ నంబర్ తీసుకుని ఇబ్బందులకు గురిచేసేవాడు. వీడియో కాల్‌లో మాట్లాడకపోతే బూతులు తిట్టేవాడు. అదిగాక నెలకు రూ.32 వేలు తీసుకునేవాడు. గతంలో నా భర్తపై మూడుసార్లు హత్యాయత్నం చేయించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

–ఓ మహిళ, గుంటూరు

అన్యాయంగా కేసులో ఇరికించారు

నా భర్త శీనయ్య తిరుపతి చిల్లకూరు మండలం జెడ్పీటీసీ. గత నెలలో రెండు వర్గాల మధ్య వివాదాలు జరిగాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య రాజీ నిమిత్తం నా భర్తను స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే అర్ధరాత్రి రెండు దాటగా, ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించాడు. అయితే, ఓ వర్గంలో ఒకరు చనిపోయినట్లు భర్తకు ఫోన్ చేసి చెప్పారు. ఈలోగా పోలీసుల సహకారంతో భర్తను అక్రమంగా కేసులో ఇరికించారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నా భర్తకు సంబంధం లేదు. లై డిటెక్టర్ ఎగ్జామినేషన్ అయ్యే ఖర్చులు భరిస్తాం. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి వినతిపత్రం యిచ్చాం. న్యాయం చేయగలరు.

– మన్నెం కర్పకవల్లి, తిరుపతి

సంస్థాగత ఎన్నికలు పటిష్టంగా నిర్వహించాలి

బీజేపీ జిల్లా ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి భానుప్రకాష్‌రెడ్డి

గుంటూరు మెడికల్: పార్టీలో సంస్థాగత ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని బీజేపీ గుంటూరు జిల్లా ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎన్నికల సన్నాహక వర్క్‌షాపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ బూత్ స్థాయి నుంచి ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా ఎన్నికలను నిర్దేశించిన సమయంలో పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జ్ మకుటం శివ, బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, జిల్లా ఎన్నికల సహ అధికారులు నేరెళ్ల మాధవరావు, కృష్ణారెడ్డి, క్రియాశీల సభ్యత్వ ప్రముఖులు కొత్తూరు వెంకట సుబ్బారావు, ఎడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస్ రెడ్డి, శనక్కాయలు అరుణ, రాష్ట్ర పదాధికారులు గాజుల వెంకయ్య నాయుడు, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పార్లమెంట్ సంయోజక భీమేని చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, వై.వి. సుబ్బారావు, చుండు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టువదలని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

శిబిరం ఏర్పాటు చేసుకుని ఆందోళనలు కొనసాగింపు


కార్మికులు తిరిగి నిర్మించుకున్న దీక్షా శిబిరం

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పట్టువదలకుండా దీక్షను కొనసాగిస్తున్నారు. శిబిరాన్ని కూల్చివేసినా తిరిగి నిర్మించుకున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పోరాట శిబిరాన్ని కూల్చివేసినా తిరిగి కార్మికులంతా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని సీఐటీయూ తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. సోమవారం ఆయన పోరాట శిబిరాన్ని సందర్శించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అధికారులు కనీస నిబంధనలను కూడా పాటించకుండా 200 గుడిసెలను అక్రమంగా కూలగొట్టడం అన్యాయమని ఖండించారు. ఏఐటీయూఎఫ్ నాయకులు కోటయ్య మాట్లాడుతూ కార్మికుల పట్టుదలను దెబ్బతీయడం కోసం ప్రభుత్వమే ఇళ్లను కూల్చివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె. స్టీవెన్, బి.అంకయ్య, బి.సూర్యప్రకాష్, ఎం.ఆశీర్వాదం, వై.యెహోషువా, కె.ఆదినారాయణ, రమాదేవి, ఎం.శారద, సామ్రాజ్యం, ఎం.గురవయ్య, సాంబశివరావు, సుబ్బారావు, యస్‌కె.ఆరిఫ్, సీపీఎం నాయకులు ఎం. పకీరయ్య పాల్గొన్నారు.

బాలోత్సవ్ జయప్రదం చేయాలి

శావల్యాపురం: బాలోత్సవాలు అత్యంత వైభవంగా జరుతాయని జిల్లా బాలోత్సవ అధ్యక్షులు సి.హెచ్.రాజారెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్ అవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఈనెల 28,29 తేదీల్లో జరగనున్న నరసరావుపేట పీఎన్‌సీఅండ్‌కేఆర్ ప్రాంగణంలో బాలోత్సవ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్టు వెల్లడించారు. బాలోత్సవ్‌కు 20 వేల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల: ప్రమాదవశాత్తూ కారు టైరు తలపైకి ఎక్కడడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలో చోటుచేసుకుంది. ఈపూరుపాలెం రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కొణిజేటి చేనేతపురికి చెందిన సత్యనారాయణ (55) బయట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఈపూరుపాలెం శివాలయం వద్ద రోడ్డుపై నిద్రించగా అటుగా వెళ్తున్న కారు చీకటిలో రోడ్డుపై నిద్రిస్తున్న వ్యక్తి కనిపించకపోవడంతో టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.